సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024







కార్యకర్తల జోష్



సభకు హాజరైన జనసందోహం





న్యూస్‌రీల్

జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించిందని కలెక్టర్ శశాంక తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ లోపు సంబంధిత శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించే ఫారం-12(డీ)లను మాత్రమే పరిగణలోకి తీసుకొని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. డీపీఆర్‌ఓ కార్యాలయం నుంచి పొందొచ్చని, ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఓటింగ్ రోజు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం లేదన్నారు. వారి పేరు వేరే జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

జిల్లా ప్రత్యేకాధికారి విజయేంద్ర బోయ

ఇబ్రహీంపట్నం రూరల్: తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర రోడ్లు రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర బోయ అధికారులకు సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ శశాంకతో కలిసి తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర బోయ మాట్లాడుతూ.. ప్రస్తుతం తాగునీటి అంశం చాలా కీలకంగా మారిందన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట చేతి పంపులు, బోర్ల మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అవసరమైన చోట ట్యాంకర్లు పెట్టి సరఫరా చేయాలని చెప్పారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేకాధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా తీరును నిత్యం పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. తాగునీటి కోసం మండలానికి ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. కాల్ సెంటర్ 93474 92260కు ఫోన్‌కాల్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మున్సిపల్ కమిషనర్లు, వాటర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుకుందాం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం రూరల్: మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుకుందామని, లౌకిక తత్వాన్ని బతికించుకుందామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం స్థాయి సమావేశం శనివారం పాషానరహరి స్మారక కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉందన్నారు. ఇబ్రహీంపట్నం, నకిరేకల్, భువనగిరి, మునుగోడు, తుంగతుర్తి, జనగాంలో తమ పార్టీ నేతలు ప్రాతినిధ్యం వహించారన్నారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధిలో ముఖ్యభూమిక పోషించారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం కలిగిన ఈ ప్రాంతంలో నేటికీ ఆ పోరాట వారసత్వం ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పోరాటాలు చేశాయా అని నిలదీశారు. కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు పోరాటం నిర్వహించారని, నేటికీ చేస్తూనే ఉన్నారని చెప్పారు. వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సాధించుకున్నామన్నారు. పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటం చేసే కమ్యూనిస్టులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, పెసరగాల జంగారెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, పగడాల యాదయ్య, జగదీశ్, సామెలు, సీహెచ్ జంగయ్య, శ్యాంసుందర్, అలంపల్లి నర్సింహ, ఈ.నర్సింహ, కె.జగన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన హోరు.. జాతర జోరు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ జనజాతరకు జనం పోటెత్తారు.. జై కాంగ్రెస్.. జై సోనియా, జై రాహుల్‌గాంధీ, జై రేవంత్‌రెడ్డి నినాదాలతో హోరెత్తించారు. ఇటు తుక్కుగూడ నుంచి శ్రీనగర్ ఈసిటీ ప్రధాన గేటు వరకు.. అటు పెద్ద గోల్కొండ నుంచి రావిర్యాల వరకు బారులు తీరారు. సభకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభోపన్యాసం చేశారు. ప్రధాన వేదికపై కాంగ్రెస్ అధినేత రాహుల్ సహా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆసీనులయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే తుక్కుగూడ వేదికగా ఆరు గ్యారంటీలను ప్రకటించి, అమలు చేస్తున్న కాంగ్రెస్.. తాజాగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఇదే వేదిక నుంచి ఐదు గ్యారంటీలను ప్రకటించి సెంటిమెంట్‌ను కొనసాగించింది. నేతల ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో జోష్ నింపాయి. ఆశించినదానికంటే అధిక సంఖ్యలో జనం తరలిరావడం.. సక్సెస్ కావడంతో నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.

తుక్కుగూడ సభ సక్సెస్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణం
- ఉత్సాహం నింపిన నేతల ప్రసంగాలు
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్

అరగంట పాటు రాహుల్ ప్రసంగం..

సాయంత్రం 5.20 గంటలకే రాహుల్ శంషాబాద్ చేరుకోవాల్సి ఉండగా 6.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వాగతం పలికారు. ఓఆర్‌ఆర్ మీదుగా తుక్కుగూడ ఎగ్జిట్ 14 నుంచి రాత్రి 7.7 గంటలకు రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ర్యాంపుపై నడుస్తూ కార్యకర్తలకు అభివాదం చేశారు. రాత్రి 7.16 గంటలకు పార్టీ జాతీయ ఐదు గ్యారంటీల హామీ పత్రాలను ఆవిష్కరించారు. రాత్రి 7.20 గంటలకు మొదలు పెట్టి 35 నిమిషాల పాటు ప్రసంగించారు.

మండుటెండలో..

మధ్యాహ్నం 2 గంటల నుంచే పార్టీ కార్యకర్తలు సభాప్రాంగణానికి చేరుకున్నారు. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో సభకు తరలి వచ్చారు. నిలువ నీడ లేకపోవడం, టెంట్లు ఏర్పాటు చేయక పోవడం, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరికి లోనయ్యారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, మహేశ్వరం సీనియర్ లీడర్ దేపా భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు తరలివస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

సైడ్‌లైట్స్



కళాకారుల ఆటాపాట

- మధ్యాహ్నం 3 గంటల నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి జనం రావడం ప్రారంభం కాగా.. రాత్రి 7 గంటల వరకు వస్తూ కనిపించారు.
- 5.30 గంటలకు జిల్లా నేతల ప్రసంగాలతో సభ ప్రారంభమైంది.
- శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా రాహుల్ గాంధీ భారీ కాన్వాయ్‌తో పోలీసు బందోబస్తు మధ్య 7.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నాయి.
- ఒకే కారులో రాహుల్ గాంధీ ముందు సీటులో కూర్చోగా, మధ్య సీటులో రేవంత్ రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి కూర్చొన్నారు.
- రాహుల్ ప్రసంగం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు.
- రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ప్రసంగ సమయంలో కార్యకర్తలు పార్టీ జెండాలతో జోష్ కనబరిచారు.
- రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలుగులోకి అనువదించారు.
- బడంగ్‌పేట మేయర్ పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సంపత్, అద్దంకి దయాకర్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, ఎంపీ అభ్యర్థులు సునీతారెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్ తమ ప్రసంగాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగారు.
- సీతక్క ప్రసంగం ప్రారంభంలో కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.
- కళాకారులు ప్రభుత్వానికి అనుకూలంగా తమ పాటలతో ఉత్తేజపరిచారు.
- సభకు జనాన్ని తరలించడానికి ఆర్టీసీతో పాటు ప్రైవేట్ బస్సులను తెప్పించారు.
- డప్పు వాయిద్య కళాకారులు శ్రీశైలం హైవే ఈ సిటీ కమాన్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రదర్శనలిస్తూ ముందుకు కదిలారు.
- సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీలపై ప్రజలు నేతల ప్రసంగాలను వీక్షించారు.
- నెహ్రూ ఔటర్ సర్వీస్ రోడ్డు, శ్రీశైలం జాతీయ రహదారి, ఈ సిటీ రోడ్లు పూర్తిగా కాంగ్రెస్ నాయకుల భారీ ఫ్లెక్సీలతో నిండిపోయాయి.
- మహిళలకు సభా ప్రాంగణంలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.
- వేసవిని దృష్టిలో ఉంచుకొని దాహార్తి తీర్చేందుకు పెద్ద ఎత్తున వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.
- ఖమ్మం నుంచి ఎంపీ సీటును ఆశిస్తున్న మల్లు నందిని అనుచరులు పెద్ద ఎత్తున ఆమె ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది.
- రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.
- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తుగా సూచించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కు చేయించారు.
- బహిరంగ సభ అనంతరం పార్టీ శ్రేణులు తిరిగి బస్సుల వద్దకు చేరుకునేందుకు అంధకారం ఉండడంతో అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్ సైతం స్తంభించడంతో గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు.
- ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం పోలీసులకు సవాలుగా మారింది.
- మేనిఫెస్టో విడుదల అనంతరం 8.30 గంటలకు సభ ముగిసింది.

– తుక్కుగూడ/పహాడీషరీఫ్

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం



నిరసన దీక్షలో మాట్లాడుతున్న సబితారెడ్డి

- కేసీఆర్ రైతుల కష్టాలు తెలుసుకుంటున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ మ్యాచ్‌లు చూస్తున్నారు
- అన్నదాతల సమస్యలను గాలికి వదిలేశారు
- పార్టీ గేట్లు కాదు.. ముందు ప్రాజెక్టుల గేట్లు ఎత్తండి
- నిరసన దీక్షలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారి సమస్యలు గాలికి వదిలేసిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు మండలకేంద్రంలో శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసనదీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబితారెడ్డి మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ సాగునీరు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రైతులు కష్టాలు పడుతుంటే సీఎం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వెళ్తుంటే ఈ ముఖ్యమంత్రి క్రికెట్ మ్యాచ్‌లు చూసేందుకు వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. రైతు బంధు రాలేదని, రుణమాఫీ చేయలేదని, సాగునీరు ఇవ్వకపోవటంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ గేట్లు కాదు.. ముందు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి రైతులకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 200 మంది రైతులు చనిపోయారని లెక్కలు చూపించినా చలనం లేదన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా తీసుకు వచ్చిన మిషన్‌భగీరథ పథకాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించలేని దుస్థితిలో ఉందన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీపై బురదజల్లే పని మాని రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఇదేనా 24 గంటల కరెంట్..?

ఒకవైపు బీఆర్‌ఎస్ నిరసన సభ నిర్వహిస్తుండగానే కరెంట్ పోయింది. అక్కడే ఉన్న పార్టీ నాయకులంతా ఇలాగే రోజూ కరెంట్ పోతుందని చెప్పారు. వెంటనే ఎమ్మెల్యే ఏఈకి ఫోన్‌చేసి కరెంట్ ఎందుకు తీసివేశారని ప్రశ్నించారు. 24 గంటల కరెంట్ అంటూ ఇష్టం వచ్చినప్పుడు తీస్తే ఎలా అని నిలదీశారు. కరెంట్ కట్‌చేస్తే అధికారులను సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు కదా మరి మీరేందుకు తీస్తున్నారని సబితారెడ్డి ప్రశ్నించారు. అలాంటిదేమీ లేదని, లైన్ ట్రిప్ అయినట్లుంది.. చెక్ చేస్తామని ఏఈ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు కె.అనంత్‌రెడ్డి, ఎం.బాల్‌రాజ్, రాంరెడ్డి, గోవర్దన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రశాంత్‌గౌడ్, యాదగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, రామగౌడ్,పి.ప్రభాకర్, వెంకటేశ్, తోట శేఖర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి మాణిక్య రెడ్డి, గణేశ్, నర్సింలు, మల్లారెడ్డి, రాములు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల ‘హస్త’గతం

- కాంగ్రెస్ ఖాతాలోకి మున్సిపాలిటీ
- చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి ఏకగ్రీవం
- వైస్ చైర్మన్‌గా కమాండ్ల యాదగిరి
- సహకరించిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- గైర్హాజరైన బీజేపీ కౌన్సిలర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ హస్తగతమైంది. చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కమాండ్ల యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిబ్రవరి 3న చైర్మన్, వైస్ చైర్మన్‌పై కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన 15 మంది కౌన్సిలర్లలో 13 మంది అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అందులో విజయం సాధించారు. కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ రావాల్సి ఉండగా జాప్యం జరుగుతూ వచ్చింది. కోర్టు జోక్యంతో కలెక్టర్, ఎన్నిల కమిషన్ కదిలింది. ఈ క్రమంలో శనివారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి ఎన్నికల అధికారిగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మహేందర్ ప్రతిపాదించగా, కుంట్ల మౌనిక బలపర్చారు. వైస్ చైర్మన్‌గా కమాండ్ల యాదగిరిని కాంగ్రెస్ కౌన్సిలర్ మర్రి అర్చన బలపర్చగా, నల్లబోలు లావణ్య బలపర్చారు. ఇద్దరినీ 13 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఆర్డీఓ అనంతరెడ్డి వెల్లడించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నిరంజన్‌రెడ్డి, కమాండ్ల యాదగిరితో ప్రమాణస్వీకారం చేయించారు. వైస్ చైర్మన్‌గా అవకాశం వస్తుందని భావించిన బీజేపీ కౌన్సిలర్ పొట్టి రాములు రాదని తెలియడంతో క్యాంపు నుంచే వెళ్లిపోయారు. సమావేశానికి రాదనుకున్న మాజీ వైస్ చైర్‌పర్సన్ కోరె కళమ్మ విచ్చేసి సంతకం చేశారు.

పార్టీశ్రేణుల సంబరాలు..

నూతన చైర్మన్‌గాఎన్నికైన మర్రి నిరంజన్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ముందుగా కమిషనర్ బాలకృష్ణ, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ వీరాంజనేయులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, బంధువులు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక , నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, శశాంక అన్నారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయన్నారు. ఈ ఏడు నియోజకవర్గాల్లో 29,19,465 మంది ఓటర్లు ఉన్నారని, 2,824 పోలింగ్ కేంద్రాలు గుర్తించామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఫారం -12ను అందజేస్తామన్నారు. 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం ఉన్న వారు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఫారం -12డీని అందజేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, రెండు జిల్లాల ఆర్డీఓలు సూరజ్ కుమార్, వెంకట్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ జన జాతరకు వస్తున్న యువత

కదం తొక్కిన హస్తం

కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలోని రాజీవ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ జన జాతర సభ సక్సెస్ అయింది. దీంతో పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నిండింది. రాష్ట్ర నలమూలల నుంచి భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. గ్యాలరీలన్నీ జనంతో కిక్కిరిసాయి. డప్పు కళాకారుల నృత్యాలు, పాటలతో సభా ప్రాంగణమంతా హోరెత్తింది.

– మహేశ్వరం


మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి


మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్


వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి


సభాప్రాంగణంలో మహిళా కార్యకర్తల జోష్


సభా వేదిక చుట్టూ ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం

- పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి
- కుంట్లూర్‌లో భారీ షెడ్ల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులిచ్చామని.. వాటిని త్వరలోనే కూల్చివేస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌లో సర్వే నంబర్ 234, 235లో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్లను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారుల సమన్వయంతో రెండు జేసీబీల సాయంతో కూల్చివేతలు ప్రారంభించారు. కాగా షెడ్లలో తమ సామగ్రి ఆపాలని నిర్వాహకులు కోరడంతో రెండు వారాల గడువు ఇచ్చారు. గడువులోగా సామగ్రిని మరో చోటు తరలించాలని సూచించామని కమిషనర్ వెల్లడించారు.

బీఆర్‌ఎస్ సభకు విద్యుత్ అక్రమ వినియోగంపై కేసు

చేవెళ్ల: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షకు అక్రమంగా విద్యుత్ వినియోగించినట్లు కేసు నమోదైంది. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా శనివారం చేవెళ్లలో చేపట్టిన దీక్ష వేదికకు అనుమతి లేకుండా ఎల్‌టీ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్ వాడారని, దీంతో ఫ్యూజులు ఎగిరిపోయి కరెంట్ అంతరాయం కలిగినట్లు గుర్తించామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తమ సమావేశంలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని సోషల్ మీడియాలో సబితారెడ్డి చేసిన కామెంట్లలో వాస్తవం లేదన్నారు. విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 135 ప్రకారం అనుమతి లేకుండా విద్యుత్ వినియోగం నేరమని, ఈ విషయంలో సభ నిర్వాహకులపై కేసు నమోదైందని తెలిపారు.